
సాక్షి ఒడిశా

గురువారం। 23। నవంబర్। 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.5,05,720
బంగారం 100 మిల్లీ గ్రాములు
వెండి 52 గ్రాముల 600 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

అయ్యో..!



పాఠశాలలో గుంజీలు తీస్తూ నాలుగో తరగతి విద్యార్థి మృతి చెందిన విషాదకర ఘటన జాజ్‌పూర్ కువాఖియా బహదలాపూర్ ఒరొలి గ్రామంలోని సూర్యనారాయణ నోడల్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో బుధవారం చోటు చేసుకుంది.

- IIలో



ఆన్‌లైన్‌లో విక్రయం..!

పూరీ శ్రీజగన్నాథుని పవిత్ర మహా ప్రసాదం నిర్మాల్య, కాజా, తులసీ దళం ఆన్‌లైన్ మాధ్యమంలో విక్రయం వివాదస్పదమైంది.

- IIలో

న్యూస్‌రీల్

ఉత్సాహంగా క్రీడా పోటీలు



కబడ్డీ ఫైనల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

జయపురం: రాష్ట్రస్థాయి ఆదివాసీ మహోత్సవాల్లో భాగంగా జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో జిల్లాస్థాయి కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. బాలికల కబడ్డీ పోటీల్లో దశమంతపూర్ సమితి టీమ్, బాలల కబడ్డీ పోటీల్లో కుంద్ర టీమ్‌లు, ఫుట్‌బాల్ పోటీల్లో లమతాపుట్ సమితి టీములు విజేతలుగా నిలిచాయి. పోటీలకు రిఫరీలుగా బ్రజరాజ్ నాగ్, డేవిడ్ బాగ్, ఋూశిష్ కుమార్, ఉత్తమ నాగ్, గుప్త గౌడలు వ్యవహరించారు. ముఖ్య అతిథిగా జిల్లా క్రీడాధికారి జ్ఞానదీప్ త్రిపాఠీ పాల్గొని క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. జయపురం సబ్ డివిజన్ సమాచార ప్రజా సంబంధాల అధికారి మనోజ్ నాయిక్, సబ్ డివిజన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రబినాయిక్ తదితరులు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.

రక్త సేకరణ వ్యాన్ వితరణ



కలెక్టర్‌కు వ్యాన్ తాళంచెవి అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

పర్లాకిమిడి: స్థానిక ఐసీఐసీఐ బ్యాంక్ సౌజన్యం రక్త సేకరణ కోసం ఒక మొబైల్ వ్యాన్‌ను బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ్ నాయక్ చేతుల మీదుగా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్‌కు కలెక్టరేట్ వద్ద బుధవారం అందజేసింది. జిల్లాలో కళాశాలలు, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు రక్తదానం చేసేందుకు పర్లాకిమిడి బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లకుండా, 068152 22787 నంబర్‌కు కాల్‌చేస్తే వారి వద్దకే వ్యాన్ వెళ్తుందని కలెక్టర్ తెలియజేశారు. వ్యాన్‌ను జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠిలు ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గుణనిధి నాయక్, ఏడీఎంవో డా.మహేంద్ర కుమార్ భుయ్యాన్, జిల్లా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రమోద్ కుమార్ పండా తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



సినామి మృతదేహం

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి కొరప గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. మృతురాలు సింగపటి పంచాయతీకి చెందిన సినామి కద్రక(50)గా పోలీసులు గుర్తించారు. సినామి పనిమీద కొరప గ్రామానికి వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఒక బైకు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ప్రమాదం జరిగి వెంటనే ద్విచక్ర వాహనంపై ఉన్నటువంటి రాణిపాడొరొ గ్రామానికి చెందిన కామేశ్వర్ కద్రక, ధన నచికలు ఆమెను పరిశీలించారు. అయితే అప్పటికే సినామి మృతి చెందడంతో తమపై నేరం పడకుండా ఉండాలని భావించి, మృతదేహాన్ని పక్కనే ఉన్న పొదల్లోకి విసిరేశారు. అటువైపుగా వెళ్తున్న కొంతమంది మృతదేహాన్ని చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా బైకుతో ఢీకొన్న కామేశ్వర్, ధన నచికలు తామే బైకుతో ఢీకొట్టామని అంగీకరించి పోలీసుస్టేషన్‌లో లొంగిపోయారు.

చీకట్లు తొలగాలని..!



ఉత్తరాఖండ్ సొరంగంలో చిక్కుకున్న కార్మికుల గాలింపులో చీకటి తొలగి వెలుగు తోడుగా నిలవాలి. ఈ కథ సుఖాంతం కావాలని అంతర్జాతీయ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ పూరీ సాగర తీరంలో ఈ సైకత శిల్పం ఆవిష్కరించాడు. సొరంగంలో చిక్కుకున్న కార్మికుల సహాయక చర్యలు ఫలప్రదం కావాలని ఇలా కళాత్మకంగా ప్రార్థించడం విశేషం.

– భువనేశ్వర్/పూరీ

వణికిస్తున్న చలిపులి

- 3 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత

కొందమాల్ జిల్లాలో రోజురోజుకీ చలి తీవ్రత పెరుగుతోంది. పుల్భణి పట్టణంలో మంగళవారం 5 డిగ్రీల ఉష్ణోగ్రతకు పడిపోగా, ఒడిశా కాశ్మీర్‌గా పేరుగాంచిన దరింగబడిలో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయి 3 డిగ్రీలకు చేరింది. దీంతో పుల్భణి, దరింగబడి, కోట్‌గడ్, జి.ఉదయగిరి, బల్లిగుడా, తుమ్ముడిబొంధొ, రైకియా, పిరిగింయా, బలందపడా, బ్రహ్మణిగామ్‌లలో చలిపులి వణికిస్తోంది. దరింగబడి, పుల్భణిలో పగలు ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలు ఉండగా రాత్రి ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా నమోదవుతున్నాయి. చలి తీవ్రత పెరుగుతుండడంతో దరింగబడికి పర్యాటకుల తాకిడి పెరిగింది. ప్రస్తుతం కొందమాల్ జిల్లాలో పగలు 10 గంటలు దాటనిదే సూర్యుడు కనిపించడం లేదు. దీంతో మంచుతో కప్పబడిన దరింగబడి అందాలు పర్యాటకులను ఎంతగానో అకట్టుకుంటున్నాయి. కాగా కళింగా ఘాట్ రోడ్ మంచుతో కప్పబడి ఉంటుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

– బరంపురం



దరింగబడిలో చలికి వణుకుతున్న ప్రజలు



మంటలు వేసుకొని చలికాగుతున్న స్థానిక ప్రజలు



కొండ ప్రాంతాల్లో మంచు ప్రభావం



సెల్ఫీలు తీసుకుంటున్న పర్యాటకులు

సభలో గందరగోళం

- గిరిజన భూముల బదలాయింపుపై రచ్చ
- స్పీకర్ పోడియం చుట్టుముట్టిన విపక్ష ఎమ్మెల్యేలు
- విపక్షాలవి చౌకబారు రాజకీయాలు: మంత్రి సుదామ్ మరాండి
- సభ నేటికి వాయిదా



ప్లకార్డులతో స్పీకర్ పోడియం ముట్టడించిన విపక్ష సభ్యులు

భువనేశ్వర్: గిరిజన (ఎస్టీ) ప్రజలు తమ భూములను గిరిజనేతరులకు విక్రయించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ సభ్యులు తీవ్ర గందరగోళం సృష్టించడంతో రాష్ట్ర శాసన సభ సమావేశాల్లో తీవ్ర అంతరాయం బుధవారం చోటుచేసుకుంది. దీంతో సభా కార్యకలాపాలు వాయిదా పడ్డాయి. శీతాకాల సమావేశాల రెండో రోజైన బుధవారం ఆదివాసీల భూ బదలాయింపు అంశంపై గందరగోళం నెలకొనడంతో రాష్ట్ర శాసనసభ వరుసగా 2 సార్లు వాయిదా పడింది. తొలుత మధ్యాహ్నం 12.00 గంటల వరకు, తదుపరి సాయంత్రం 4.00 గంటల వరకు వాయిదా పడింది. ప్రశ్నోత్తరాల ఆరంభం నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. వరుసగా 2 సార్లు సభని వాయిదా వేసి ప్రారంభించినా పరిస్థితి సద్దుమణగకపోవడంతో గురువారం వరకు నిరవధికంగా వాయిదా వేశారు.

వెల్‌లోకి దూసుకెళ్లిన ఎమ్మెల్యేలు

రెండో రోజు కార్యకలాపాల నేపథ్యంలో సభ ప్రారంభమైన వెంటనే భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి దూసుకెళ్లారు. అనంతరం వీరు చేసిన నినాదాలతో సభ దద్దరిల్లింది. కొద్దిసేపటి తర్వాత రాష్ట్ర ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ సభ్యులు కూడా బీజేపీతో కలిసి స్పీకర్ పోడియం చుట్టుముట్టారు. గందరగోళం మధ్య స్పీకర్ ప్రమీలా మల్లిక్ సభను మధ్యాహ్నం 12.00 గంటలకు వాయిదా వేశారు. తదుపరి సభ సమావేశమైనా ప్రతిపక్ష శాసన సభ్యులు సభలో తమ నినాదాలతో ఆందోళన కొనసాగించడంతో మళ్లీ గందరగోళం యథాతథంగా కొనసాగింది. దీంతో సభా కార్యక్రమాలను కొనసాగించడం స్పీకర్‌కు ఇబ్బందిగా మారడంతో ఆమె సభను రెండోసారి సాయంత్రం 4.00 గంటలకు వాయిదా వేశారు. ఆపై గురువారంకు నిరవధికంగా వాయిదా వేసినట్లు ప్రకటించారు.

ఇదీ విషయం

షెడ్యూల్డ్ తెగల ప్రజలు తమ భూమిని గిరిజనేతరులకు సబ్ కలెక్టర్ రాత పూర్వక అనుమతితో బదలాయించేందుకు వీలుగా ఒడిశా షెడ్యూల్డ్ ప్రాంతాల స్థిరాస్తుల బదిలీ (ఎస్టీల ద్వారా) నిబంధన 1956ను సవరించాలని రాష్ట్ర మంత్రివర్గం ఈనెల 14న నిర్ణయించింది. అయితే దీనిపై తీవ్ర విమర్శలు ఎదురవ్వడంతో రెండు రోజుల తర్వాత ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని నిలుపుదల చేసింది. అయినప్పటికీ చట్ట సవరణకు మంత్రివర్గం మొదటి నిర్ణయం తీసుకోవడంపై ఆందోళనలు చెలరేగాయి. అయితే బీజేడీ ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమం కోసం పని చేస్తోందని రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సుదామ్ మరాండి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గిరిజనుల భూ బదలాయింపుపై ఇటీవల కేబినెట్ నిర్ణయాన్ని నిలుపుదల చేశామని తెలిపారు. ఈ అంశంపై ప్రతిపక్షాలు చౌకబారు రాజకీయాలు చేస్తూ అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకుంటున్నాయని విచారం వ్యక్తం చేశారు.

బీజేపీలోకి తిరుపతి గరుడ



తిరుపతితో కెప్టెన్ దివ్యశంకర్ మిశ్రా తదితరులు

కొరాపుట్: జిల్లాకి చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు తిరుపతి గరుడ అధికార బీజేడీలో చేరారు. బుధవారం రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని బీజేడీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కొరాపుట్ జిల్లా బీజేడీ పరిశీలకుడిగా ఉన్న కలహండి జిల్లా జునాఘడ్ ఎమ్మెల్యే కెప్టెన్ దివ్య శంకర్ మిశ్ర ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. తిరుపతి గత సార్వత్రిక ఎన్నికల్లో కొరాపుట్ బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. అయితే ఆ సమయంలో బీజేపీ ఉనికే లేని ఆ ప్రాంతంలో తిరుపతికి వచ్చిన 35 వేల ఓట్లు సంచలనంగా మారాయి. ఇటీవల కొరాపుట్ జిల్లాకు చెందిన బీజేడీ నాయకుడు రఘురాం మచ్చోని ఆ పార్టీ సస్పెండ్ చేయగా, బీజేపీ తీర్థం పుచ్చుకున్నాడు. దీంతో తిరుపతి రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఇది గమనించిన బీజేడీ నాయకులు తిరుపతితో సంప్రదింపులు జరపడంతో ఆయన ఆ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ, కొరాపుట్ జిల్లాకి చెందిన ఎమ్మెల్యేలు రఘురాం పాడాల్, పద్మిని దియాన్, పీతం పాడీ, ప్రభుజానీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు జిన్ను హిక్కా తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పంటపై ఉక్కుపాదం



గంజాయి పంటను తగలబెడుతున్న ఎక్సైజ్ అధికారులు

బరంపురం: రాష్ట్రంలోని పోలీసులు గంజాయి పంటపై ఉక్కుపాదం మోపుతున్నారు. దీనిలో భాగంగా కొందమాల్ జిల్లాలో గత మూడు రోజులుగా వివిధ ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ ఆదేశాలతో వందలాది ఎకరాల్లో పంటను ధ్వంసం చేశారు. అదేవిధంగా బుధవారం సైతం బల్లిగుడా పోలీసుస్టేషన్ పరిధి కామన్‌కులా అటవీ ప్రాంతంలో అక్రమంగా సాగు చేస్తున్న రూ.16 కోట్ల విలువైన చెట్లను ఎక్సైజ్ మరియు అటవీ అధికారులు పూర్తిగా ధ్వంసం చేశారు.



గంజాయి పంటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

ఆవుపై పులిదాడి

పర్లాకిమిడి: నిన్నటివరకు ఆంధ్రప్రదేశ్‌లో భయపెట్టిన పెద్దపులి తిరిగి గజపతి జిల్లాకు మరలా వచ్చింది. రాయఘడ బ్లాక్ కుమ్ములిసింగి గ్రామం అమల్‌బోలో వద్ద ఒక ఆవుపై దాడిచేసి చంపడం ట్రాక్ కెమేరాల ద్వారా గుర్తించినట్లు అటవీశాఖ అసిస్టెంట్ కన్జర్వేటర్ అధికారి అశోక్ కుమార్ బెహరా బుధవారం తెలియజేశారు. రాయఘడ బ్లాక్‌లోని నారాయణపూర్, కుమ్ములిసింగి వద్ద ఐదు ట్రాక్ కెమేరాలు అమర్చినట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 18న రాయఘడ బ్లాక్ గంగాబడ పంచాయతీ సంతోష్‌పూర్ గ్రామంలోకి తొలుత పులి ప్రవేశించి ఆవుపై దాడి చేసింది. అనంతరం సరిహద్దు మెళియాపుట్టి, పాతపట్నం మండలాల మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లోకి వెళ్లింది.



ట్రాక్ కెమేరాకు చిక్కిన పులి, ఆవును ఆరగిస్తున్న దృశ్యం

అటవీ అధికారుల హెచ్చరికలు

బుధవారం దేవగిరి రేంజ్ అధికారులు రాయఘడ బ్లాక్ కుమ్ములుసింగి, నువాగాం, కరడాబన మరియు నువాగడ బ్లాక్‌లోని పెద్దసాహి, తిత్తిసింగి, ఖోజురిపద వంటి గ్రామాల్లో పెద్దపులిపై హెచ్చరికలు జారీ చేశారు. సాయంత్రం తర్వాత ఒంటరిగా బయటకు వెళ్లవద్దని, పశువులు, మేకలను ఇంటి వద్ద కట్టాలని సూచించారు. పులి వయస్సు సుమారు ఐదు సంవత్సరాలు ఉంటుందని, అందుకే మనుషులపై దాడి చేయడానికి సాహసం చేయడం లేదన్నారు. రోజుకు కనీసం 20 నుంచి 30 కిలోమీటర్లు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్తుందని ఏసీఎఫ్ అశోక్ కుమార్ బెహరా తెలియజేశారు.



జంగోలా గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శనలు

జయపురం: స్థానిక తెలుగు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జయపురం సిటీ ఉన్నత పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శనలు, ఫుడ్ మేళాలను నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 79 సైన్స్ ప్రాజెక్టులు, 34 నాన్ కుక్డ్ ఫుడ్ ప్రాజెక్టులు ప్రదర్శించబడ్డాయి. ప్రాజెక్టులను 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తయారు చేశారు. ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసేందుకు న్యాయ నిర్ణేతలుగా ప్రదీప్త కుమార్ సాహు, సౌమ్యరంజన్ దొళాయిలు వ్యవహరించగా, ఫుడ్ మేళాలో ప్రదర్శించబడిన ఆహార పదార్థాలతో ఉత్తమ వంటకాలను ఎంపిక చేసేందుకు న్యాయ నిర్ణేతగా మహ్మద్ వహీద్ షరాఫ్, నిరంజన్ పాణిగ్రాహిలు వ్యవహరించారు. ప్రదర్శనల్లో సీనియర్ గ్రూపులో వి.కృష్ణవేణి, వై.గంగోత్రి ప్రథమ స్థానాలు పొందగా, రెండో స్థానంలో ఎ.బావన, మూడో స్థానంలో చిడ్డి సాయివిలాస్, ఆదిత్య ఝూలు నిలిచారు. బి.దివ్య, పి.వర్షిణిలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ ప్రాజెక్టులు జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరగనున్న బ్లాక్ స్థాయి ప్రదర్శనలో పాల్గొంటాయని వెల్లడించారు. అలాగే జూనియర్ గ్రూపులో ఎ.కిరణ్ ప్రథమ, దివ్య బహుదూర్ ద్వితీయ, సంస్కృతి దాస్ పట్నాయక్ తృతీయ స్థానాలు సాధించగా, ఎ.యామిని ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. ఫుడ్ మేళాలో ఎస్.జ్యోతి టీమ్ ప్రథమ, ఎ.జ్ఞానేశ్వరి టీమ్ ద్వితీయ, శ్వేత టీమ్ తృతీయ స్థానాల్లో నిలవగా, సుమిత టీమ్ ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పెర్సన్ బి.సునీత, మాజీ వైస్ చైర్మన్ దుర్గా ప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్ తిలకిస్తున్న వైస్ చైర్‌పర్సన్ సునీత



ఫుడ్ మేళాలో పదార్థాలను రుచి చూస్తున్న టీచర్

భారీ మావో డంప్ స్వాధీనం



జవాన్‌లు వెలికితీసిన డంప్‌లో సామగ్రి

మల్కన్‌గిరి:

జిల్లాలోని మత్తిలి సమితి తులసీ పాహడ్‌లో బుధవారం తెల్లవారుజామున ఎస్పీ నితీష్ వాద్వానీ నేతృత్వంలో డీవీఎఫ్, ఎస్‌వోజీ సంయుక్త కూంబింగ్ నిర్వహించారు. ఈ సమయంలో తులసీ పాహడ్ కిరిమేట్ల గ్రామ అడవిలో ఎన్నికల సమయంలో విధ్వంసం సృష్టించేందుకు మావోలు దాచిపెట్టిన భారీ డంప్ గుర్తించారు. అయితే జవాన్లు చాకచక్యంగా డంప్‌ను వెలికితీశారు. ప్రస్తుతం ఛత్తీస్‌ఘడ్‌లో ఎన్నికలు జరుగుతుండడంతో అక్కడ ఉపయోగించేందుకు డంప్ దాచినట్లు అనుమానిస్తున్నారు. డంప్‌లో ఒక నాటు తుపాకీ, 40 కిలోలు ఐఈడీ బాంబ్‌లు, జిలిటెన్ స్టిక్స్, కరెంట్ వైర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మావోలు ఎన్ని ఎత్తులు వేసినా చిత్తు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.



మావోలు డంప్ అమర్చిన ప్రాంతం

క్లుప్తంగా

బీఎంసీ భారీ జరిమానా



చెట్టుకు అనధికారికంగా పోస్టర్ అతికించిన నేరారోపణ కింద టీమ్ భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ భారీ జరిమానా విధించింది. స్థానిక జయదేవ్ విహార్ ప్రాంతంలో చెట్టుకు ఎవాల్వ్ (ఒక మల్టీ డిజైనర్ స్టోర్)పై బీఎంసీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ నేపథ్యంలో ఆ సంస్థకు రూ.50,000 జరిమానా విధించింది. ఈ సందర్భంగా చెట్టు, స్తంభం మరియు గోడ (టీపీడబ్ల్యూ)పై అనధికారిక పోస్టర్లు, బ్యానర్లు అతికించవద్దు. ఉల్లంఘనకు పాల్పడితే ఇటువంటి భారీ జరిమానా చెల్లించక తప్పదని బీఎంసీ హెచ్చరించింది.

– భువనేశ్వర్

క్రీడాకారునికి ఆర్థిక సాయం



గౌతమ్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ విక్రమ్

విజయనగరం : జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు కె.గౌతమ్‌కు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ ఆర్థికసాయం చేశారు. డిసెంబరు 8, 9, 10వ తేదీల్లో మహారాష్ట్రలోని ముంబై ప్రియదర్శిని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే పోటీల్లో 61–65 కేజీల విభాగంలో గౌతమ్ పాల్గొంటుండగా, పోటీలకు హాజరయ్యేందుకు అవసరమైన ఆర్థికసాయాన్ని విక్రమ్ తన క్యాంపు కార్యాలయంలో బుధవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి, బంగారు పతకంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

సూక్ష్మ మెలకువలపై అవగాహన



వెంకటరావును అభినందిస్తున్న రిజిస్ట్రార్ పల్లవి తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో విద్యార్థులకు సూక్ష్మ మెలకువలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్యాకేజీతో ఉద్యోగం పొందాలంటే పుస్తక జ్ఞానంతో పాటు ఏదైనా అంశంలో ప్రత్యేక నైపుణ్యం, సామర్థ్యం ఉండాలని తెలిపారు. సాఫ్ట్ స్కిల్స్(పబ్లిక్ స్పీకింగ్, గ్రూప్ డిస్కషన్, వృత్తి నైపుణ్యం) పై మంచి పట్టు సాధించాలన్నారు. విశాఖ గాయత్రి విద్యా పరిషత్‌కు చెందిన ప్లేస్‌మెంట్ సెల్ అధికారి వెంకటరావు స్మార్ట్ గోల్స్ అంశంపై కాసేపు మాట్లాడి, విద్యార్థులను మోటివేట్ చేశారు. కార్యక్రమంలో వర్సిటీ సిబ్బంది సన్నీడియోల్, దేవికా రాణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు జిల్లా జట్లు ఎంపిక

బాడంగి: జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు జిల్లా బాలురు, బాలికల జట్లు ఎంపికైనట్లు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ, బేస్‌బాల్ కోచ్ జి.బంగారునాయుడు తెలిపారు. ఇదే విషయమై ఆయన స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మాట్లాడారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో గుంటూరు జిల్లా, వెలిగండ్లలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–19 బేస్‌బాల్ పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున పాల్గొన్న ఇరు జట్లు తృతీయ స్థానంలో నిలిచి, జాతీయ పోటీలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారిలో ఎం.శేఖర్, సీహెచ్ మహేష్(తెర్లాం), బి.రేవతి, ఆర్.సమీరా(ఉల్లిభద్ర), ఎం.అఖిల(పారాది) ఉండగా, వీరంతా 2024 జనవరిలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

20న కవితా సౌరభం

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 26వ తేదీన రాయల వారి కవితా సౌరభం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఆముక్త మల్యాద పద్యావలోకనం అంశంపై ప్రముఖ సాహితీవేత్త, రాజాం రచయితల వేదిక వ్యవస్థాపకుడు గార రంగనాథం ప్రసంగం ఉంటుందన్నారు.

బీజేడీ, కాంగ్రెస్ కలిసి అక్రమాలు చేస్తున్నాయి



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు



మాట్లాడుతున్న గౌతమ్ సామంతరాయ్

- జీజేపీ నాయకుల ఆరోపణ
- జయపురంలో భారీ ర్యాలీ

జయపురం: రాష్ట్రంలో బీజేడీ ప్రభుత్వం, జయపురంలో బీజేడీ నేతలు, అధికారులు, స్థానిక ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతిలు కలిసి అవినీతికి పాల్పడుతున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వందలాది మంది బీజేపీ కార్యకర్తలు జయపురం మున్సిపాలిటీ, సమితి కార్యాలయాలను బుధవారం ముట్టడించారు. రాష్ట్ర బీజేపీ శాశ్వత కార్యవర్గ సభ్యుడు గౌతమ్ సామంతరాయ్ నేతృత్వంలో ఆ పార్టీ శ్రేణులు రఘునాథ్ మందిరం నుంచి ర్యాలీ నిర్వహిస్తూ మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు గేటు మూసివేయడంతో కార్యకర్తలు గేటును తోసుకొని లోపలికి వచ్చారు. అయితే కార్యనిర్వాహక అధికారి లేకపోవడంతో మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలపై మున్సిపల్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జయపురం సమితి కార్యాలయానికి వెళ్లి బీడీవో శక్తి మహాపాత్రోకు వినతిపత్రం అందించారు.

నిధులు స్వాహా చేస్తున్నారు

ఈ సందర్భంగా గౌతమ సామంతరాయ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ, సమితి కార్యాలయాలు అవినీతి ఊబిలో కూరుకుపోయాయని ఆరోపించారు. స్థానిక బీజేడీ, కాంగ్రెస్ నాయకులు చేతులు కలిపి అవినీతికి పాల్పడుతున్నారని దుమ్మెత్తిపోశారు. జగన్నాథ్ సాగర్ అభివృద్ధి పేరుతో నిధులు స్వాహా చేస్తున్నారని ధ్వజమెత్తారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. అనేక వీధులు అంధకారంలో ఉంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. అర్హులైన వారిని ఆవాస యోజనలో చేర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన అనేక మంది పింఛన్ల కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పలు పథకాల్లో భాగంగా నిధులు మంజూరు చేస్తుండగా, అధికారులు సక్రమంగా వినియోగించడం లేదని దుయ్యబట్టారు. ఈ అక్రమాలు, అవినీతిని అరికట్టకపోతే రానున్న రోజుల్లో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సెల్ సాధారణ కార్యదర్శి కాశీ మఝి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సుమంత ప్రధాన్, యువనేత హిమాంశు మహాపాత్రో, బీజేపీ నేతలు అరుణ భోట మిశ్ర, సాబణ మహంతి, స్వాతీ, బైద్యనాథ్ మిశ్ర, కె.భవానీ రెడ్డి, సురభి పాణి తదితరులు పాల్గొన్నారు.

అయ్యో..!

- గుంజీలు తీస్తూ విద్యార్థి మృతి



చిన్నారి రుద్ర నారాయణ్ సెఠి

భువనేశ్వర్: పాఠశాలలో గుంజీలు తీస్తూ నాలుగో తరగతి విద్యార్థి మృతి చెందిన విషాదకర ఘటన జాజ్‌పూర్ కువాఖియా బహదలాపూర్ ఒరొలి గ్రామంలోని సూర్యనారాయణ నోడల్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో బుధవారం చోటు చేసుకుంది. మృతి చెందిన విద్యార్థి నిత్యానంద సెఠి కుమారుడు రుద్ర నారాయణ్ సెఠి(10)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. రుద్ర నారాయణ్ యథాతథంగా పాఠశాలకు వెళ్లాడు. మధ్యాహ్నం పూట స్నేహితులతో కలిసి రుద్ర పాఠశాల ప్రాంగణంలో తిరుగాడుతున్నట్లు ఉపాధ్యాయుని దృష్టిలో పడింది. వారిని పిలిచి పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు అడగగా సమాధానాలు చెప్పలేకపోయారు. దీంతో గుంజీలు తీయమని దండన విధించారు. కాగా రెండు గుంజీలు తీయడంతో రుద్ర నారాయణ్ స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే టీచర్ రుద్ర తండ్రికి సమాచారం అందించడంతో కుటుంబీకులు హుటాహుటిన పాఠశాలకు వచ్చారు. అనంతరం రుద్రను చికిత్స నిమిత్తం స్థానిక మధువన్ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. అక్కడ అతను చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. దీనిపై నమ్మకం కుదరక విద్యార్థి తల్లిదండ్రులు ధర్మశాల కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం మరియు కటక్ ఎస్సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలోని వైద్యులను సంప్రదించినా విషాదమే మిగిలింది. గుంజీలు తీయించడంతోనే తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయాడని తల్లిదండ్రులు బోరుమన్నారు.

పాఠశాలలో విచారణ

సమాచారం అందుకున్న రసూల్‌పూర్ సహాయ మండల విద్యాధికారి (ఏబీఈవో) డాక్టర్ ప్రభంజన్ పతి పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తుల వాంగ్మూలాన్ని బట్టి విద్యార్థి ఆస్తమాతో బాధపడుతున్నాడు. ఛాతీ నొప్పిగా ఉంది పాఠశాలకు వెళ్లనని మారాం చేసిన కొడుకుని తల్లి బుజ్జగించి బలవంతంగా పాఠశాలకు పంపించినట్లు సమాచారం. తల్లి బలవంతంతో తరగతులకు హాజరైన రుద్ర నారాయణ్ తరగతి గదిలో మౌనంగా కూర్చున్నట్లు ఏబీఈవో విచారణలో ప్రాథమిక సమాచారం. పాఠశాలలో రెండు గుంజీలు తీయడంతో రుద్ర నారాయణ్ కుప్పకూలిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. మెడికల్ రిపోర్టుల కోసం నిరీక్షిస్తున్నారు. ఏదైనా చర్య తీసుకునే ముందు విద్యార్థి తల్లిదండ్రుల వాంగ్మూలాన్ని పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని ఏబీఈవో డాక్టర్ ప్రభంజన్ పతి తెలిపారు.

చిరస్మరణీయుడు లక్ష్మణ్ నాయక్

స్వాతంత్య్ర పోరాటంలో సాహిద్ లక్ష్మణ్ నాయక్ భూమిక చిరస్మరణీయమని వక్తలు అన్నారు. ఆయన 125వ జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. సారాకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపి ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. – సాక్షి నెట్‌వర్క్



జయపురం: సాహిద్ లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజలు



కొరాపుట్: లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్



జయపురం: కాంగ్రెస్ భవన్‌లో నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు



కొరాపుట్: భువనేశ్వర్‌లో లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగన్నాథ సరక తదితరులు



రాయగడ: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ సింగ్

ఆన్‌లైన్‌లో విక్రయం..!

- జగన్నాథుని నిర్మాల్య ఆన్‌లైన్‌లో విక్రయం వివాదస్పదం



ఫిర్యాదు చేస్తున్న శంభునాథ్ ఖుంటియా



అమెజాన్‌లో విక్రయానికి ఉంచిన జగన్నాథుని ప్రసాదం

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని పవిత్ర మహాప్రసాదం నిర్మాల్య, కాజా, తులసీ దళం ఆన్‌లైన్ మాధ్యమంలో విక్రయం వివాదస్పదమైంది. ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ సంస్థ స్వామివారి ప్రసాదాలను అక్రమంగా విక్రయిస్తోందని పూరీ శ్రీజగన్నాథ ఆలయ సేవకుడు శంభునాథ్ ఖుంటియా పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. అమెజాన్ ఇండియా సంస్థకు వ్యతిరేకంగా ఆయన పూరీ సింహ ద్వారం ఠాణాలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిర్మాల్య, 3 కాజాలు, స్వల్ప తులసీ దళాలను అమెజాన్ ఆన్‌లైన్‌లో విక్రయిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీని ధర రూ.1,500గా నిర్ణయించగా, తగ్గింపు ధరగా రూ.799కి విక్రయిస్తున్నట్లు ఉంది. ఆలయ అధికార వర్గం (ఎస్‌జేటీఏ) అనుమతి లేకుండా ఈ–కామర్స్ కంపెనీ ఇలాంటి వ్యాపారం చేస్తోందని సేవాయత్ ఆరోపించారు. దీనిపై వెంటనే విచారణ జరిపి కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంతకుముందు 2020 సంవత్సరం డిసెంబర్‌లో ఉత్సవ్ అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ ద్వారా జగన్నాథుని పేరిట సాలగ్రామ రాయి మరియు మహా ప్రసాదాన్ని విక్రయించినట్లు ఆరోపణలు వచ్చాయి.

రెల్లివీధిలో కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న సారాకేన్లు, ప్యాకెట్లతో ఎస్ఈబీ సిబ్బంది

పార్వతీపురంటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రెల్లివీధిలో ఎస్ఈబీ(స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అధికారులు కార్డన్ సెర్చ్ బుధవారం చేపట్టారు. సొండి చంద్ర, గండి బాబూరావు, రాజాన సుహాసిని, ఒడిశాకు చెందిన కొండగొర్రి సాంబాల దగ్గరున్న 180 లీటర్ల సారాను పట్టుకుని, స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎస్ఐలు జె.రాజశేఖర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హాకీ పోటీలకు రిషి

విజయనగరం అర్బన్: జాతీయ స్థాయి హాకీ పోటీలకు స్థానిక ఫోర్ట్ సిటీ స్కూల్ విద్యార్థి పి.రిషి ఎంపికయ్యారు. అనకాపల్లి జిల్లా, నక్కపల్లిలో ఇటీవల జరిగిన స్కూల్‌గేమ్స్ హాకీ పోటీల్లో సదరు విద్యార్థి పాల్గొని, విశేష ప్రతిభ కనబరచడంతో జాతీయ పోటీలకు ఎంపికైన రాష్ట్ర జట్టులో సభ్యుడిగా రిషి స్థానం దక్కించుకున్నట్లు ప్రిన్సిపాల్ రోహినా ఖాన్ తెలిపారు. మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు.



ముగిసిన రాష్ట్రపతి పర్యటన

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 3 రోజుల రాష్ట్ర పర్యటన బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ ఆమెకు ఝార్సుగుడ వీర్ సురేంద్ర సాయి విమానాశ్రయంలో వీడ్కోలు పలికారు. ఆయనతో పాటు విమానాశ్రయంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరయ్యారు.

– భువనేశ్వర్

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

- ప్రభుత్వ చర్యలతో గర్భిణుల్లో తగ్గుతున్న హైరిస్క్
- ప్రతినెలా తగ్గుతున్న కేసుల సంఖ్య
- జూన్‌లో 295 కేసుల నమోదు
- సెప్టెంబరులో 221 కేసుల నమోదు
- హైరిస్క్ గర్భిణులు సుఖ ప్రసవమయ్యేలా చర్యలు



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఆస్పత్రికి చేరుకుంటున్న గర్భిణి

విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర ప్రభుత్వం చర్యలతో గర్భిణుల్లో హైరిస్క్(అధిక ప్రమాదం) తగ్గుతోంది. కిశోరి బాలికల దశ నుంచి వారి ఆరోగ్యంపై జగనన్న సర్కారు ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా నెలలో రెండుసార్లు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, విద్యార్థులు, గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. వారిలో ఏవైనా వ్యాధులు ఉన్నట్లు గుర్తిస్తే తగిన చికిత్సను అందిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులు రక్తహీనత, పౌష్టికాహారం లోపం బారినపడకుండా వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ పథకాల ద్వారా పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. దీంతో పాటు గర్భం దాల్చిన నాటి నుంచి గర్భిణులకు అవసరమైన వైద్యతనిఖీలు, పరీక్షలు చేసి, హైరిస్క్ గర్భిణులను గుర్తించి, నిత్యం వారి ఆరోగ్యంపై వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉంచి, వారు సుఖంగా ప్రసవమయ్యేలా చూస్తున్నారు. దీంతో మాతృమరణాలు సంభవించకుండా చూడగలుగుతున్నాం.

3 నెలల్లో తగ్గిన కేసులు..

క్రమక్రమంగా హైరిస్క్ గర్భిణుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. నెలల హైరిస్క్ కేసుల సంఖ్య ప్రస్తుతం తగ్గుముఖం పట్టింది. జూన్‌లో 295 హైరిస్క్ కేసులు నమోదు కాగా, సెప్టెంబరు నెలాఖరు నాటికి 221కి కేసుల సంఖ్య తగ్గింది. మూడు నెలల కాలవ్యవధిలో దాదాపు 70 కేసుల వరకు హైరిస్క్ కేసుల సంఖ్య తగ్గింది.

వారం రోజుల ముందే ఆస్పత్రికి..

ప్రసవ తేదీకి వారం రోజులు ముందుగానే హైరిస్క్ గర్భిణులను ప్రసవానికి ఆస్పత్రికి తరలిస్తారు. అంతేకాకుండా జనన సంసిద్ధత ప్రణాళిక వేసుకుని మరీ సదరు గర్భిణులను సకాలంలో ఆస్పత్రిలో చేర్చుతున్నారు. ప్రసవమయ్యే వరకు ప్రతిరోజూ ఏఎన్ఎం, ఆశావర్కర్, హెల్త్ సూపర్‌వైజర్స్, హెల్త్ ఎడ్యుకేటర్స్, పీహెచ్‌సీ వైద్యుల పర్యవేక్షణ ఉంటుంది. అలాగే వారికి అవసరమైన చికిత్స అందిస్తుంటారు. నెగిటివ్ గ్రూపు రక్తం కలిగిన వారికి నెల రోజులు ముందు నుంచే ఆ గ్రూపు రక్తాన్ని రిజర్వ్ చేసి, ఉంచుతున్నారు. హైరిస్క్ గర్భిణులకు సకాలంలో ఆస్పత్రికి చేరుకుని, వైద్యసేవలు పొందేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను నడుపుతోంది. ఇప్పటికే చాలామంది వీటిని సద్వినియోగం చేసుకుని, సకాలంలో వైద్య సేవలు పొందుతున్నారు.

హైరిస్క్ అనగా..

బీపీ, సుగర్‌తో బాధపడుతున్న గర్భిణులను హైరిస్క్ గర్భిణులుగా పరిగణిస్తారు. రక్తహీనత, థైరాయిడ్, బరువు ఎక్కువగా ఉన్న వారు, ఫిట్స్, హెచ్ఐవీ, క్షయ, మొదటి కాన్పులో సిజేరియన్ అయిన గర్భిణులను సైతం హైరిస్క్ గర్భిణులుగా పరిగణిస్తారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ



ప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్త చర్యలతో గర్భిణులు హైరిస్క్ బారిన పడకుండా ఉండగలుగుతున్నారు. అంతేకాకుండా హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం, ప్రతిరోజూ వారి ఆరోగ్యం పర్యవేక్షిస్తుండడంతో వారు సుఖంగా ప్రసవమవుతున్నారు.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌వో

వేర్వేరు దుర్ఘటనల్లో పలువురికి గాయాలు

- వైద్యసేవల నిమిత్తం ఆస్పత్రిక్షి క్షతగాత్రుల తరలింపు
- కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న పోలీసులు

గుమ్మలక్ష్మీపురం: వేర్వేరు చోట్ల జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కంబగూడ గ్రామం వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎల్విన్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. గొయిపాక గ్రామానికి చెందిన మీసాల రోహిత్, మీసాల నందిని ద్విచక్ర వాహనంపై కురుపాం వెళ్తుండగా, గొయిపాక వైపు ఇద్దరు వ్యక్తులతో వస్తున్న ద్విచక్ర వాహనం ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నందిని కుడికాలు విరిగిపోగా, రోహిత్ కాలికి తీవ్రగాయమైంది. ఈ సమాచారం తెలుసుకున్న స్థానికులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, వైద్యసేవల నిమిత్తం క్షతగాత్రులను కురుపాం సీహెచ్‌సీకి తరలించారు. బైక్‌తో వీరిని ఢీకొన్న వారు పరారయ్యారు.

బస్సు నుంచి జారిపడి..

భామిని: బస్సు నుంచి జారిపడి విద్యార్థి పి.చైతన్యకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. బిల్లుమడ గ్రామానికి చెందిన ఈ విద్యార్థి ఏపీ మోడల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బస్సు ఎక్కుతుండగా ప్రమాదం బారినపడినట్లు తెలుస్తోంది. స్థానికుల సహకారంతో తొలుత స్థానిక పీహెచ్‌సీకి తరలించి, విద్యార్థికి ప్రాథమిక చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో కొత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని..

పార్వతీపురంటౌన్: ట్రాక్టర్ ఢీకొన్న దుర్ఘటనలో బలిజిపేట మండలం, పనుకువలస గ్రామానికి చెందిన సంకా శోకనాథ్ గుప్తా అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం పనుకువలస సమీపంలోని పీతలబంద చెరువు వద్ద బుధవారం జరిగింది. పార్వతీపురం జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సొంత పనుల నిమిత్తం పణుకువలస నుంచి బొబ్బిలికి టీవీఎస్ మోపెడ్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పీతలబంద చెరువు మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న పణుకువలస వైపు వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో గాయపడిన అతడిని 108 అంబులెన్స్‌లో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి, వైద్యసేవలు అందించారు.

క్లుప్తంగా

భవన నిర్మాణ కార్మికుడు మృతి

నరసన్నపేట: స్థానిక పెద్దపేట వీధిలో నూతన భవనం నిర్మాణ పనుల్లో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికుడు పల్లి అప్పన్న (47) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బుధవారం సాయంత్రం మూడో అంతస్తు పైకి వాటర్ ట్యాంకు తీసుకువెళ్తుండగా జారిపడటంతో అక్కడికక్కడే మరణించాడు. నరసన్నపేటలోని ముద్దాడ వీధికి అప్పన్నకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తె ఉన్నారు. పెద్ద కుమార్తె మౌనికకు వివాహం కాగా రేవతికి వివాహం కావాల్సి ఉంది. మృతుడి భార్య లక్ష్మి నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డిగ్రీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిట్స్ సహకారంతో కృష్ణా జిల్లా నందిగామలో కిట్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, కిమ్స్ రిసెర్చ్ అండ్ ఫౌండేషన్ సహకారంతో హైదరాబాద్‌లో శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. రెండు నెలల శిక్షణ పూర్తయిన వెంటనే కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు రాగోలు జెమ్స్ ఆసుపత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్ విభాగాన్ని గానీ, 7680945357, 7995013422 నంబర్లను గానీ సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఎచ్చెర్ల ఐటీఐలో అప్రెంటీస్ మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో బుధవారం హైదరాబాద్‌కు చెందిన సర్వో మేధా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అప్రెంటీస్, జాబ్‌మేళా నిర్వహించింది. జిల్లా నుంచి ఐటీఐ పూర్తిచేసిన 239 మంది హాజరయ్యారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా 23 మందిని ఎంపిక చేశారు. అప్రెంటీస్ అనంతరం ఉద్యోగాలు కల్పించనున్నారు. ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు, కంపెనీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

రణస్థలం: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లావేరు మండలం బుడుమూరు గ్రామానికి చెందిన నల్లి రాజేష్‌కు(24) విజయనగరం జిల్లా వంగర గ్రామానికి చెందిన గొర్లె అనూషతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. రాజేష్ రణస్థలంలోనే ఉంటూ ఓ బైక్ షోరూంలో పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఈ నెల 10న పురుగులు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. భార్య అనూషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ రాజేష్ తెలిపారు.

పోరాటయోధుడు పినకాన

నందిగాం: నిర్బంధాలను ఎదిరించి శ్రమజీవులు పక్షాన పోరాటం చేసిన యోధుడు పినకాన కృష్ణమూర్తి అని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు భవిరి కృష్ణమూర్తి అన్నారు. నందిగాం మండలం చిన్నలక్ష్మీపురంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నంబూరు షణ్ముఖరావు అధ్యక్షతన బుధవారం పినకాన కృష్ణమూర్తి ఏడో వర్ధంతి సభ నిర్వహించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పినకాన కుటుంబ సభ్యులతో పాటు కోనారి మోహనరావు, పినకాన అజయ్‌కుమార్, కోత మధు, కింతలి ధర్మారావు, పాలిన సాంబమూర్తి, ఈశ్వరరావు, పాల్గొన్నారు.

వివాదాస్పద రోడ్డు పరిశీలన



నారువలో భూములు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

రణస్థలం: మండలంలోని నారువ గ్రామ రెవెన్యూ పరిధిలో కొత్తగా నిర్మించనున్న నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ రహదారిని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ బుధవారం పరిశీలించారు. గ్రామంలో ఎన్ఏసీఎల్ ప్లాంట్‌కు కేటాయించిన భూములు, రహదారి వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ వెనుక వైపు ఉన్న కొంతాలపాలెం గ్రామానికి రహదారి వెళ్లాల్సి ఉంది. అయితే రహదారి స్థలం మరో పరిశ్రమకు రిజిస్ట్రేషన్ కావడంతో వివాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్డీవో సీహెచ్ రంగయ్య, తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వీఏఎస్ఎస్ఏ నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జిల్లా కేంద్రంలో జరిగింది. అధ్యక్షుడిగా దువ్వాడ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా బి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా టి.హరికృష్ణ, ట్రెజరర్‌గా ఎల్.కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.ఓంకార్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.కిషోర్, డిప్యూటీ డైరెక్టర్లు ఎం.జగన్నాథం, వి.జయరాజు, రాజగోపాల్, చంద్రశేఖర్, రవికృష్ణలు శుభాకాంక్షలు తెలిపారు.

యాంత్రీకరణతో 'ఆదా'యం

- పెరిగిన వరికోత, నూర్పిడి యంత్రాల వినియోగం
- ఆదా అవుతున్న ఖర్చులు, సమయం
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు



వరికోత యంత్రంతో నూర్పిడి చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: వ్యవసాయంలో యంత్రాల వినియోగంపై జిల్లా రైతులు ఆసక్తి చూపుతున్నారు. తద్వారా ఖర్చులు, సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు. వరి పొలాలు ప్రస్తుతం కోత, నూర్పిడి దశలో ఉన్నాయి. గతంలో ఈ పనులను వ్యవసాయ కూలీలతో చేయించేవారు. తీవ్ర వ్యయప్రయాసలకు గురయ్యేవారు. వరికోత, నూర్పిడి యంత్రాలతో పనులు సునాయసంగా పూర్తవుతుండడంతో వీటి వినియోగం ఇటీవల కాలంలో బాగా పెరిగింది. వరి కోత యంత్రం పంటను కోసి పనలుగా వేస్తుండగా, నూర్పిడి యంత్రం పంటను కోసి నూర్పిడి చేసి రైతుగా నేరుగా ధాన్యం అందిస్తుంది. అయితే నూర్పిడి యంత్రంతో ఎండు గట్టి రద్దుగా మారుతుండడంతో పశు గ్రాసానికి పనికిరావడం లేదు. దీనవల్ల కొందరు రైతులు వరి కోత యంత్రాన్ని మాత్రమే వినియోగిస్తున్నారు.

జిల్లాలో వరిసాగు విస్తీర్ణం:	1,41,330 హెక్టార్లు
ఈ ఏడాది వరిపంట దిగుబడి అంచనా:	8.40 లక్షల మెట్రిక్ టన్నులు
వరి పంట కోత, నూర్పిడికి ఏకకాలంలో గంటకు:	రూ.2500
రైతులకు ఆదా:	ఎకరాకు రూ.4 వేలు వరకు

పెట్టుబడులు ఆదా..

సాధారణంగా ఎకరా విస్తీర్ణంలో వరి పంట కోయాలంటే 10 నుంచి 12 మంది కూలీలు అవసరం. ఒక్కొక్కరికి రూ. 300 చొప్పున కూలీ ఇస్తే రూ.3000 అవుతుంది. దీంతో పాటు వరిపనలు కుప్పలు చేయడానికి రూ.2వేలు, మరాల నూర్పిడికి రూ.2500 వరకు ఖర్చవుతుంది. ఇదే వరికోత నూర్పిడి యంత్రాన్ని ఉపయోగిస్తే రూ.2700తో మొత్తం పని అయిపోతుంది. ఎకరం పొలాన్ని గంటలోనే వరికోత, నూర్పిడి చేస్తుంది. దీంతో రైతులకు ఎకరానికి రూ.4 వేలు వరకు ఆదా అవుతుంది. అంతేకాకుండా ధాన్యం కూలీలతో కోసేటప్పుడు రాలిపోయే అవకాశం ఉంది. పనలు కూడా వత్తుగా పడతాయి. అవి ఆరడానికి తిరగేయాల్సి వస్తుంది. అదే యంత్రంతో కోత చేస్తే పన పలచగా పడి తిరగేయాల్సిన పని లేదు. వరి నూర్పిడి యంత్రంతో పనిచేస్తే ఏకంగా ధాన్యం చేతికి వస్తాయి. యంత్రాలను కూడా వ్యవసాయ శాఖ రైతులకు అందుబాటులో తీసుకొస్తోంది. రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులు గ్రూపులుగా ఏర్పడినా, రైతు సొంతంగా యంత్రాల కొనుగోలు చేయాలన్నా కియోస్క్ యంత్రం ద్వారా ఆర్డర్ చేస్తే సరిపోతుంది. ఇప్పటికే గ్రామాల్లో యంత్రాల ద్వారా వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి.



కోత అనంతరం ధాన్యాన్ని కుప్పగా వేస్తున్న యంత్రం

ఆశల దిగుబడి..

ఈ ఏడాది ఖరీఫ్ సాగు చేసిన వరి పంట చేతికందడంతో రైతులు దిగుబడులపై ఆశలు పెట్టుకున్నారు. నూర్పిడి యంత్రంతో వరికోతలు కోయడం వల్ల ధాన్యం కూడా దిగుబడులు ఎంత వస్తున్నాయో రైతులకు తెలుస్తున్నాయి. ఎకరాకు 28 నుంచి 32 బస్తాలు (82 కిలోలు) దిగుబడి వస్తుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పని సులువు..



వరిపంటలో కోత, నూర్పిడి యంత్రం వినియోగంచడం ద్వారా ఖర్చులు, సమయం ఆదా అవుతాయి. సకాలంలో కోతలు పూర్తయి ధాన్యం అమ్మకాలు సులువుగా చేసుకోవచ్చు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే పంటకు మంచి గిట్టుబాటు ధర కలుగుతుంది. ప్రస్తుతం యాంత్రీకరణ ద్వారా వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

– మెట్ట మోహనరావు, మండల వ్యవసాయాధికారి, ఆమదాలవలస

పీజీ కోర్సుల్లో సిలబస్ మార్పు తప్పనిసరి



మాట్లాడుతున్న వీసీ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో కాలానుగుణంగా సిలబస్‌లో మార్పులు తప్పనిసరి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. ఎచ్చెర్లలోని వర్సిటీ పాలక మండలి సమావేశ మందిరంలో బుధవారం పీజీ కోర్సుల కరిక్యులమ్, సిలబస్‌లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం-2020 నేపథ్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా కోర్సులనిర్వహణపై కసరత్తు జరుగుతుందని చెప్పారు. ఉన్నత విద్యా మండలి సైతం విద్యార్థుల్లో నైపుణ్యాలకు ప్రాధాన్యమిస్తుందన్నారు. పరిశ్రమలు, జాతీయ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో అనుసంధానం చేసి కోర్సులు నిర్వహిస్తామన్నారు. డిగ్రీ విద్యలో సైతం సమూల మార్పులు వస్తున్నాయని చెప్పారు. హానర్స్, సమీకృత నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. డిగ్రీ సబ్జెక్టుల్లో వచ్చిన మార్పులకు అనుగుణంగా పీజీ విద్యలో మార్పులకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వర్సిటీ పరిధిలో నాగార్జున అగ్రికెం, అరబిందో ఫార్మా, కృష్ణపట్నం సెక్యూరిటీ లిమిటెడ్ వంటి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలు, అమలు, విద్యలో ప్రయోజనాలు, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు శివకుమార్, శ్యాంకుమార్, మనోహర్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ చింతాడ రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

'మావోయిస్టు కదలికలు లేవు'



వజ్రపుకొత్తూరు పీఎస్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ నాగేశ్వరరెడ్డి

వజ్రపుకొత్తూరు: పలాస ప్రాంతంలో మావోయిస్టు కదలికలు లేవని కాశీబుగ్గ డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి అన్నారు. ఆయన బుధవారం వజ్రపుకొత్తూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి విలేకరులతో మాట్లాడారు. ఎస్ఐఏ పరిశీలన, స్థానిక పోలీసులు చక్కటి అబ్జర్వేషన్ ఉండడం వల్ల ఈ ప్రాంతంలో మావోయిస్టు చర్యలకు అవకాశం లేదని అన్నారు. ప్రజల్లో అవగాహన పెరిగిందని శాంతి భద్రతలకు ఎలాంటి ఢోకా లేదని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్, ట్రాఫిక్, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

బైక్ మెకానిక్ షెడ్లు దగ్ధం



కాలిపోతున్న షెడ్లు

పాతపట్నం: మండలంలోని పెద్దసీది పంచాయతీ చంద్రయ్యపేటలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో బైక్ మెకానిక్ షెడ్లు దగ్ధమయ్యాయి. చంద్రయ్యపేటలో రహదారి పక్కన కొమనాపల్లి గ్రామానికి చెందిన దోమ ధర్మారావు కొంతకాలంగా బైకులు రిపేర్ చేస్తున్నాడు. అతని షెడ్ పక్కనే మరో షెడ్‌లో మొర్రి వెంకటరమణ బైక్ స్పేర్ పార్టులు అమ్ముతున్నాడు. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో బైక్ షెడ్‌లో మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న మరో షెడ్‌లోకి మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో 8 బైక్‌లు, స్పేర్ పార్టులు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్తులు వెంటనే కొత్తూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ.16 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి ఉంటాయని గ్రామస్తులు భావిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని కొత్తూరు అగ్నిమాపకాధికారి ఎం.బుచ్చోడు తెలిపారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు నలుగురు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా బాక్సింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీలకు శ్రీకాకుళం జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో పి.అప్పలరాజు, పి.విశ్వేశ్వరరావు, డి.మనోజ్‌కుమార్, హేమంత్‌కుమార్ ఉన్నారు. ఈ పోటీలు మేఘాలయలోని షిల్లాంగ్ వేదికగా ఈ నెల 24 ఉంచి డిసెంబర్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పోటీలకు ఎంపికైన నలుగురు క్రీడాకారులు భీమేశ్వర బాక్సింగ్ క్లబ్‌లో శిక్షణ పొందుతున్న వారు కావడం విశేషం. వీరికి డీఎస్ఏ బాక్సింగ్ కోచ్ ఎం.ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ రాజీవ్ గాంధీ ఉన్నతంగా శిక్షణను అందించి తీర్చిదిద్దుతున్నారు. పోటీలకు రిఫరీగా జిల్లాకు చెందిన అనంత లక్ష్మణ్‌దేవ్ నియామకం అయ్యారు. క్రీడాకారులతోపాటు ఆయన కూడా బయల్దేరి వెళ్లారు.

రహదారి రక్తసిక్తం

- లారీ ఢీకొని ఇద్దరు రైతులు మృతి
- పొలం చూసి వస్తుండగా ఘటన



ఘటనా స్థలంలో ద్విచక్రవాహనంపై ఉన్న లారీ



లారీ టైర్ల కింద నుజ్జయిన సుందరరావు, మిన్నారావు మృతదేహాలు

కాశీబుగ్గ:

నీలావతి జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతులు మృతి చెందారు. పొలానికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. పెద్ద నీలావతి గ్రామానికి చెందిన బొంగు సుందరరావు (40), కొండాల మిన్నారావు (41)లు బైక్‌పై ఉజ్జిడిమెట్ట వద్ద ఉన్న పొలాలను చూసేందుకు వెళ్లారు. కొబ్బరి చెట్లూరు కూడలి వద్దకు చేరుకుని పంటపొలానికి దగ్గర అవుతుందనగా.. రాంగ్ రూట్‌లో నీలావతి గేటువైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ వీరి బండిని బలంగా ఢీకొట్టింది. దీంతో వీరిద్దరూ కింద పడగా.. వారిపై నుంచి లారీ వెళ్లిపోయింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. నీలావతి రైలుగేటుకు వందమీటర్ల దూరంలో జరిగిన సంఘనను చూసిన వారంతా నివ్వెరపోయారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు, హైవే అంబులెన్స్ సిబ్బంది మృతదేహాలను పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

పెద్దనీలావతి గ్రామానికి చెందిన బొంగు సుందరరావుకు భార్య బొంగు గీత, కుమారులు విషాల్, రోహిత్‌లు ఉన్నారు. మరో మృతుడు కొండాల మిన్నారావుకు భార్య జానకి, కుమార్తె భాగ్య ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. ప్రమాదంపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీవైఈఓకు అభినందనలు



విజయకుమారికి అభినందనలు తెలుపుతున్న ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారిగా నియమితులైన రాకోటి విజయకుమారి(డీవైఈవో)ని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర, జిల్లాశాఖల ప్రతినిధులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్ఎంఎస్ఏ ఉప విద్యాశాఖాధికారిగా, పాలకొండ డిప్యూటీ ఈవోగా, ప్రధానోపాధ్యాయులుగా విజయవంతంగా సేవలు అందించి శ్రీకాకుళం డిప్యూటీ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న విద్యా సంబంధిత సమస్యలు పరిష్కరించాలని, ఉపాధ్యాయులకు బాసటగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు బొత్స జానకీరామ్, గౌరవాధ్యక్షుడు సోరీ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల రమేష్, జిల్లా అధ్యక్షుడు వడమ శరత్, జిల్లా కార్యదర్శి జగదీష్, విజయప్రసాద్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్జెక్టులపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరరావు

నరసన్నపేట: విద్యార్థుల్లో చదవడం, రాయడం స్కిల్స్ అభివృద్ధి చేసేందుకు వీలుగా ఉపాధ్యాయులు సబ్జెక్టులపై మరింత పట్టు సాధించడానికి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన 6, 7, 8వ తరగతుల ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు బుధవారం లిప్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులు, ఆధునిక విద్యా బోధనలు దృష్టిలో పెట్టుకొని నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. ప్రధానంగా విద్యార్థుల్లో చదవడం, రాయడం వంటి స్కిల్స్ అభివృద్ధి చేయడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. హిందీ తప్ప మిగిలిన సబ్జెక్టుల్లో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు యు.శాంతారావు, దాలినాయుడు, హెచ్ఎం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖలో అక్రమ వసూళ్లపై విచారణ



విచారణ చేపడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

రణస్థలం: మండలంలోని ప్రభుత్వ మద్యం దుకాణదారుల సూపర్‌వైజర్లు, సేల్స్‌మేన్ల నుంచి ఎక్సైజ్ శాఖలోని ఓ ఉన్నతాధికారి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ (ఎస్ఈబీ) డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం రణస్థలం వెలుగు కార్యాలయంలో ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్, అద్దె ఓనర్లను విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ వైజర్లు, సేల్స్‌మెన్లు బదిలీలపై అక్రమ వసూళ్లు, దుకాణదారుల నుంచి నెల అద్దె సొమ్ము ఇవ్వాలనే డిమాండ్లపై ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. విచారణలో అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు, సీఐ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలే శరణ్యం



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకుడు కొండయ్య

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రతిఘటనతో సాగే సమరశీల ప్రజా పోరాటాలే అమరవీరులకు నిజమైన నివాళి అని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ రాష్ట్ర నాయకుడు వై.కొండయ్య, జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ అన్నారు. మర్రిపాడులోని తామాడ గణపతినగర్‌లో బుధవారం అమరవీరుల 45వ స్మారక సభ నిర్వహించారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద విప్లవజోహార్లు అర్పించారు. ప్రజా సంఘ నాయకుడు జి.బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రాపాక మాధవరావు, ఎస్.నీలంరాజు, కుత్తుం హేమమ్మ, బర్ల గోపి, సార జగన్, బి.భాస్కరరావు, సింహాద్రి, మల్లేశ్వరరావు, కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

• ప్రదర్శన అదుర్స్!



శ్రీకాకుళం నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో సాయి బృందావనం వద్ద సత్యసాయి జయంతి వేడుకల్లో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అభినయ నృత్యనికేతన్ నృత్యదర్శకులు డాక్టర్ టి.నీరజా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అద్భుత ప్రదర్శన ఇచ్చారు.

– శ్రీకాకుళం కల్చరల్

కొలనులో ఉత్సవం.. కోవెలలో ఉత్సాహం

- ఆదిత్యుని తెప్పోత్సవం రేపు
- రంగులతో సిద్ధమైన హంస వాహనం
- నేడు ట్రయల్ రన్



ఇంద్రపుష్కరిణిలో సిద్ధంగా ఉన్న హంసవాహనం

అరసవల్లి: కోవెల కొలనులో సూరీడు కదిలే వేళయ్యింది. క్షీరాబ్ధి ద్వాదశి నాడు ఇంద్ర పుష్కరిణిలో విహరించడానికి సమయం ఆసన్నమైంది. ప్రసిద్ధ అరసవల్లి సూర్యక్షేత్రంలో శుక్రవారం ఆదిత్యుడు హంస వాహనంలో దేవేరులతో కలిసి ఇంద్రపుష్కరిణిలో విహరించనున్నారు. అదే రోజు స్వామి స్వర్ణాలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు దర్శనమిచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయం లోపల, బయట కూడా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏటా కార్తీక శుద్ధ ద్వాదశి నాడు ముగ్గురు దేవేరులతో స్వామి హంస వాహనంలో 12 సార్లు విహరించడం ఇక్కడి క్షేత్రంలో సంప్రదాయం. ఈ ఉత్సవానికి వేలల్లో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, అలాగే అధిక సంఖ్యలో మహిళలు కార్తీక దీపాలను తెప్పల్లో విడిచిపెట్టేందుకు రానున్న సందర్భంగా పుష్కరిణి ఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ సభ్యులు ఈ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఈ ఉత్సవం కోసం పుష్కరిణి చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆవరణ అంతా శుభ్రపరిచి విద్యుత్ అలంకరణ చర్యలు చేపట్టారు.

నేడు ట్రయల్ రన్

హంసవాహనం ఫిట్‌నెస్ పరీక్ష గురువారం జరుగనుంది. పవిత్ర ఇంద్ర పుష్కరిణిలో 12 సార్లు విహరించేలా అందుకు తగిన సామర్థ్యం కోసం నేడు ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఆలయ ఈఓ హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మలతో పాటు పాలకమండలి సభ్యులు, మత్స్య శాఖ, ఫైర్, పోలీస్ ఇతరత్రా సాంకేతిక సిబ్బందంతా ఈ ట్రయల్‌రన్‌లో పాల్గొని లోపాలుంటే సరిచేసేలా చర్యలు చేపట్టనున్నారు. అంతా పక్కా అని అధికారులు ధ్రువీకరించగానే శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి హంస విహారం ప్రారంభం కానుంది. ఇటీవల ఆలయ పాలకమండలి సభ్యులు తీర్మానించిన మేరకు ఈ హంసవాహనంలో ఈసారి వైదిక సిబ్బంది (అర్చక పండితులు) పాటు బోటు సిబ్బంది మాత్రమే వాహనం ఎక్కేందుకు అనుమతి ఉండనుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పోలీస్ సిబ్బంది తగు చర్యలు చేపట్టనున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు



తెప్పోత్సవానికి ఈసారి భక్తుల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ఆలయ పరిసరాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. అలాగే శుక్రవారం దర్శన సమయాల్లో స్వర్ణాలంకరణతో స్వామి వారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. అలాగే గురు వారం హంసవాహనం ట్రయల్ రన్ చేసి పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తోనే తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నాం. ఈ వాహనంలోకి అర్చకులు, సహాయకులకు మాత్రమే అనుమతివ్వనున్నాం.

– వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ఈఓ